ప్రజాశక్తి

మంగళవారం 30 ఏప్రిల్ 2024 1

అనంతపురం శ్రీ సత్యసాయి





సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థులెవరన్నది తేలారు. బరిలో నిలిచేది ఎవరన్నది స్పష్టమైపోయింది. అనంతపురం జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలకు కలిపి 113 మంది అభ్యర్థులు బరిలోనున్నారు. సత్యసాయి జిల్లాలో 78 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇక అనంతపురం పార్లమెంటు బరిలో 21 మంది అభ్యర్థులుండగా, హిందూపురం పార్లమెంటుకు 13 మంది అభ్యర్థులు బరిలోనున్నారు.

బరిలో నిలిచే వారి లెక్క తేలింది..!



◆ అసెంబ్లీకి 'అనంత'లో 113 మంది...
సత్యసాయి జిల్లాలో 78 మంది

◆ అనంత పార్లమెంటుకు 21,
హిందూపురానికి 13 మంది..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సోమవారంతో ఉపసంహరణలు పూర్తయ్యాయి. శనివారం రోజు ఒక్క ఉపసంహరణ జరగనప్పటికీ సోమవారం నాడు ఆఖరి రోజు పెద్దఎత్తున ఉపసంహరణలు జరిగాయి. అనంతపురం జిల్లాలో ఎనిమిది అసెంబ్లి నియోజకవర్గాల పరిధిలో మొత్తం 23 మంది నామినేషన్లను ఉపసంహరించు కున్నారు. ఇందులో అత్యధికంగా తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎనిమిది మంది అభ్యర్థుల నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. అనంతపురం అర్బన్‌లో ఆరు మంది, గుంతకల్లులో ముగ్గురు, శింగనమలలో ఇద్దరు, రాప్తాడులో ఇద్దరు, రాయదుర్గం, కళ్యాణదుర్గంలో ఒక్కొక్కరు చొప్పున నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. మొత్తం 136 నామినేషన్లు వాలిడ్‌కాగా 23 మంది అభ్యర్థులు ఉపసహరించుకోవడంతో 113 మంది బరిలో నిలిచినట్టయింది. సత్యసాయి జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 83 నామినేషన్లు ఆమోదం కాగా ఐదుగురు ఉపసంహరించుకనున్నారు. దీంతో 78 మంది బరిలో నిలిచినట్టయింది. ఇక హిందూపురం పార్లమెంటుకు 15 వాలిడ్ నామినేషన్లు ఉండగా ఇద్దరు ఉపసంహరించుకోవడంతో 13 మంది బరిలో నిలిచినట్టయింది. ఉరవకొండ, హిందూపురం, ధర్మవరం, కదిరిలో ఒక్క నామినేషన్ కూడా ఉపసంహరణ జరగలేదు.

సునీల్‌కుమార్ ఉపసంహరణ

మడకశిర నుంచి టిడిపి రెబల్‌గా నామినేషన్ వేసిన మడకశిర మాజీ ఎమ్మెల్యే కుమారుడు సునీల్‌కుమార్ నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఈయన్ను టిడిపి అభ్యర్థిగా ప్రకటించి బిఫామ్ ఇచ్చే సమయంలో మార్పు జరిగింది. దీంతో మడకశిరలో ఈరన్న మద్దతుదారులు పెద్దఎత్తున నిరసనలు వ్యక్తం చేశారు. స్వతంత్రంగా బరిలో ఉంటానని కూడా ప్రకటించారు. అయితే సోమవారం జరిగిన నామినేషన్ల ఉపసంహరణలో నామినేషను ఉపసంహరించుకున్నారు. పార్టీ అధిష్టానం బుజ్జగింపులతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

అనంతపురం జిల్లాలో అభ్యర్థులు

నియోజకవర్గం	నామినేషన్లు	ఉపసంహరణలు	అభ్యర్థులు
రాయదుర్గం	14	01	13
ఉరవకొండ	11	00	11
గుంతకల్లు	17	03	14
తాడిపత్రి	26	08	18
శింగనమల	16	02	14
అనంతపురం అర్బన్	21	06	15
కళ్యాణదుర్గం	16	01	15
రాప్తాడు	15	02	13

అనంతపురం జిల్లాలో అభ్యర్థులు

నియోజకవర్గం	నామినేషన్లు	ఉపసంహరణలు	అభ్యర్థులు
మడకశిర	16	03	13
హిందూపురం	13	00	13
పెనుకొండ	10	01	09
పుట్టపర్తి	16	01	09
ధర్మవరం	15	00	15
కదిరి	13	00	13
మొత్తం	83	05	78



విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

అఫిడవిట్‌లో తప్పులపై..

హైకోర్టుకెళ్తాం

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-సోమందేపల్లి

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ అఫిడవిట్‌లో కనబరచని కేసులపై హైకోర్టుకు వెళ్తామని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. ఆమె సోమవారం పెనుకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ సవితమ్మ అఫిడవిట్‌లో 17 కేసులు ఉన్నట్లు ప్రకటించారని, అవికాకుండా సొంత వదిన పద్మనారాయణరెడ్డి మీద గృహహింసకు సంబంధించిన కేసును, ఆమె తల్లి గాయిత్రిదేవి ఆస్తికి సంబంధించి పెట్టిన కేసు వివరాలను అఫిడవిట్‌లో చూపలేదన్నారు. సవితమ్మపై ఆంధ్రాలోనే కాకుండా కర్నాటకలో కూడా కేసులున్నాయని గుర్తుచేశారు. ఛీటింగ్, ఫోర్జరీ, 420 కేసులు ఉన్నట్లు సవితమ్మ తన అఫిడవిట్‌లో స్వయంగా పేర్కొన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. లేపాక్షి, బెంగళూరు, రొద్దం, కియా పోలీస్ స్టేషన్లలో కూడా సవితమ్మపై కేసులు ఉన్నాయన్నారు. సొంత కుటుంబానికి న్యాయం చేయలేని సవితమ్మ నియోజకవర్గ ప్రజలకు ఏమి న్యాయం చేస్తుందని మండిపడ్డారు. ఇక లోకల్ అని చెప్పుకొనే సవితమ్మ ఎక్కడ లోకల్ అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు, బాలకృష్ణ, లోకేష్, పవన్‌కళ్యాణ్, దగ్గుపాటి ప్రసాద్, సత్యకుమార్ లోకలా అని ప్రశ్నించారు. సవితమ్మ అఫిడవిట్‌లో కనబరచని కేసులపై హైకోర్టుకు వెళ్తున్నట్లు తెలిపారు. సమావేశంలో హిందూపురం ఎంపి అభ్యర్థి బోయ శాంతమ్మ, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు ఉమాపతి, డి.నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైసిపితోనే బిసిల అభివృద్ధి

ఎంపి అభ్యర్థి ఎం.శంకరనారాయణ

2లో..

టిడిపి రెబల్ అభ్యర్థి

నామినేషన్ ఉపసంహరణ

7లో..

కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుందాం

ప్రచారంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

4లో..

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

టిడిపి అర్బన్ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్

8లో..



ప్రచార వేడి..!



◆ ఠారెత్తిస్తున్న ఎండలు

◆ పెరిగిన ఉష్ణోగ్రతలతో బయటకురావాలంటనే భయం

◆ అయినా అభ్యర్థులకు తప్పని ప్రచారాలు

◆ ఉదయం, సాయంత్రం వేళల్లో పర్యటనలు

◆ నీడ కోసం వాహనాల్లో ప్రత్యేక ఏర్పాట్లు



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈ ఏడాది ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఇదే సమయంలో ఎన్నికలు ఉండడంతో ప్రచారాల కోసం అభ్యర్థులు, నాయకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కాలుతీసి బయట పెట్టాలంటే భయంకరమైన ఎండలు భయపెడుతున్నాయి. అయినా ప్రచారాలు చేయక తప్పని పరిస్థితులు. ఎండ వేడిమిని తట్టుకుని ప్రచార వేడిలో అభ్యర్థులు ముందుకు సాగక తప్పడం లేదు. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు, ఉపసంహరణలు పూర్తయ్యాయి. ఇక మిగిలింది పోలింగ్ మాత్రమే. మే 13వ తేదీన పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించి సమయం చాలా తక్కువగా ఉండడంతో అభ్యర్థులు ముమ్మర ప్రచారాలు చేస్తున్నారు. భానుడి ఉగ్ర రూపాన్ని భరించలేక చాలా మంది తమ ప్రచారాలను ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తున్నారు. ఓ వైపు ఎన్నికల వేడి, మరోవైపు భానుడి వేడితో ఉమ్మడి జిల్లా హోరెత్తుతోంది.

పోలింగ్ సమయం దగ్గర పడడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అభ్యర్థులు ప్రచారాలను జోరుగా చేస్తున్నారు. భానుడి ఉగ్రరూపంతో అనుకున్న స్థాయిలో కార్యకర్తలు వీరి ప్రచారంలో కలిసి రావడం లేదు. వస్తున్న వారు కూడా ఎండవేడిమిని తట్టుకోలేక మధ్యలోనే ప్రచారం నుంచి ఉపసంహరించుకుంటున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీలు టిడిపి, వైసిపి కాంగ్రెస్ వేదిక అభ్యర్థులు ప్రచారాలతో జనం వద్దకు వెళ్తున్నారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రచారాలు చేసేందుకు అభ్యర్థులు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారు. మధ్యాహ్న సమయంలో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల వరకు నమోదు అవుతున్నాయి. గత వారం రోజులుగా ఎండ వేడిమితో పాటు వడగాలులు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎండలో

మిగతా 3లో

ఎన్నికలకు సహకరించాలి : ఏఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ప్రతి ఒక్కరూ ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి కోరారు. ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు సోమవారం అనంతపురం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని పిల్లిగుండ్ల కాలనీ, ఆలమూరు, కామారుపల్లి, కొడిమి, నరసనాయనికుంట, తాటిచెర్ల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రశాంత నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తామని, ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని కోరారు. ఎన్నికల వేళ గొడవలు, అల్లర్ల జోలికెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ సి.ఐ రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇటుకలపల్లి వద్ద క్షుణ్ణంగా తనిఖీలు

అనంతపురం రూరల్ డీఎస్పీ బి.వి శివారెడ్డి ఆధ్వర్యంలో ఇటుకలపల్లి క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ఎస్ఐ రాఘవేంద్రరెడ్డి, స్పెషల్ పార్టీ, బీఎస్ఎఫ్ సిబ్బంది క్షణ్ణంగా ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఎన్నికల సందర్భంగా మద్యం, నగదు, ఇతర ఉచితాలు అక్రమంగా రవాణా కాకుండా ఉండేందుకు వాహన తనిఖీ చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు.

డాక్టర్ సిజి.పద్మావతి సేవలు మరువలేనివి

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కంటి వైద్య విభాగం అభివృద్ధిలో ప్రధాన విభాగాధిపతి డాక్టర్ సిజి.పద్మావతి సేవలు మరువలేనివని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు కొనియాడారు. పద్మావతి పదవీ విరమణ సందర్భంగా సోమవారం స్థానిక వైద్య కళాశాలలోని సుశ్రుత హాల్లో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ పద్మావతి సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కంటి వైద్య విభాగం అభివృద్ధిలో తనపాత్ర అనంతమైందన్నారు. సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నీతి, నిజాయితీ, క్రమశిక్షణతో వృత్తి ధర్మాన్ని త్రికరణ శుద్ధిగా నిర్వహించిన అతి కొద్దిమందిలో అగ్రగణ్యులు పద్మావతి అని కొనియాడారు. అనంతపురం సర్వజన ఆసుపత్రిలో 30ఏళ్లకు పైగా నిర్విరామంగా సేవలు చేసి ఎంతోమందికి నేత్రదానాన్ని ప్రసాదించారన్నారు. డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ భగవంతుడు ప్రసాదించిన వైద్య వృత్తిని అంత్ఃకరణ శుద్ధితో నిర్వహించానన్నారు. తనకు తోడ్పాటు అందించిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.



పద్మావతి దంపతులను సన్మానిస్తున్న అతిథులు

ఈ కార్యక్రమంలో ఎపి ప్రభుత్వ వైద్యుల సంఘం అనంతపురం శాఖ అధ్యక్షులు డాక్టర్ రామస్వామినాయక్, ఎపి జిడిఎ ప్రెసిడెంట్ డాక్టర్ రామస్వామినాయక్, సీనియర్ వైద్యులు డాక్టర్ అక్బర్‌సాహెబ్, కొండయ్య, ఎండ్లూరి ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాళ్లు కెఎల్ సుబ్రమణ్యం, శారోన్ సోనియా, నవీన్, కంటి వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వైఎంఎస్ ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కెవి మానస, దివ్య, శ్రీనివాస ఫణి, భవానీశంకర్, ఆప్తాల్మోలజీ పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి ముమ్మర ప్రచారం

గుత్తి : మండల పరిధిలోని బసినేపల్లి తండా, బసినేపల్లి, లచ్చానుపల్లి గ్రామాల్లో టిడిపి నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణ, తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంకె.చౌదరి, చిన్నారెడ్డియాదవ్, పి.భరత్‌కుమార్, బర్ధివలి, శ్రీనివాస్‌యాదవ్, వీరభద్రయ్య, దిల్కాశీనా, రాజా, తిరుపాలు, పులికొండ, మహమ్మద్ అలీ, అగ్గిరాముడు,తదితరులు పాల్గొన్నారు.

పామిడి : పట్టణంలోని 13, 14, 18వ వార్డుల్లో గుమ్మనూరు జయరామ్‌కు మద్దతుగా యువనాయకులు గుమ్మనూరు మదన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

నాగదేవతల విగ్రహాల ప్రతిష్టాపన

బెలుగుప్ప : మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో వెలసిన శివాలయ దేవస్థానంలో బూదలి శంకర్‌స్వామి వేద పండితుల ఆధ్వర్యంలో సోమవారం నాగుల విగ్రహాలను వైభవంగా ప్రతిష్టించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి వేద పండితుల ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

వైసిపితోనే బిసిల అభివృద్ధి

ఎంపి అభ్యర్థి ఎం.శంకరనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీతోనే బిసిల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. సోమవారం శింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నె మండలం ఆర్ఎస్ కల్లూరు గ్రామంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య ఆధ్వర్యంలో యాదవుల ఆత్మీయత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు ప్రాధాన్యత కల్పించిన నాయకుడు సిఎం జగన్ అన్నారు. బీసీలు రాజకీయంగా అభివృద్ధి చెందాలంటే జగన్ మరోసారి సిఎం కావాలన్నారు. ఎందుకంటే బీసీలకు 50 శాతం కంటే ఎక్కువగా సీట్లు ఇచ్చిన దేశంలో ఏకైక నాయకుడు జగన్ అని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో బీసీలు ఆర్థికంగా ముందుకెళ్లడానికి బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేశారన్నారు. గతంలో బీసీలందరికీ చేతి పనిముట్లు ఇచ్చి చేతులు దులుపుకున్న ఘనత చంద్రబాబుదే అన్నారు. అంతేగాకుండా బిసిలను రాజకీయంగా అణగదొక్కిన టిడిపి నాయకులు ఇప్పుడు గొప్పలు చెప్పుకోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా యాదవులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వారికి అత్యధికంగా ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించారన్నారు. కావున యాదవులంతా వైసిపి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వేయించి అనంతపురం ఎంపీగా తనను, శింగనమల ఎమ్మెల్యేగా వీరాంజనేయులును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.శంకరనారాయణ

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం అర్బన్ ప్రాజెక్టు ఐసిడిఎస్ కింద ఉన్న నేతాజీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో సోమవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.ఎన్.శ్రీదేవి మాట్లాడుతూ 3 నుంచి ఆరేళ్లలోపు చిన్నారులను తల్లిదండ్రులు తప్పనిసరిగా అంగన్వాడీ సెంటర్లకు పంపాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. అంతేగాకుండా అంగన్వాడీల్లో పంపిణీ చేస్తున్న పిపి.1, పిపి.2 సిలబస్ పుస్తకాలు, ప్రీ స్కూల్ మెటీరియల్ చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ సిడిపిఓ సి.లలిత, సూపర్‌వైజర్ విజయమ్మ, అంగన్వాడీ నిర్మల, ఆయా సరోజమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న అతిథులు

అగ్రికల్చర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఏ.రవికుమార్

అనంతపురం : విజయవాడలో ఆదివారం జరిగిన వ్యవసాయ శాఖ రాష్ట్ర ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏ.రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నకయ్యారు. అదేవిధంగా స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శిగా ఆదంఖాన్ ఎన్నికయ్యారు. ఈకార్యక్రమానికి అనంతపురం ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ నుంచి రాజేంద్రప్రసాద్, కార్యవర్గ సభ్యులు వెంకటేసులు, రంగస్వామి, పుల్లయ్య, రాజగోపాల్, బాలాజీనాయక్, ప్రభాకర్, ప్రణేష్, గురు రాఘవేంద్ర, రఘు హాజరయ్యారు.

బ్యాంకు ఖాతాల్లోకి పింఛన్లు : ఎంపిడిఒ

పామిడి : సామాజిక భద్రతా పింఛన్ లబ్ధిదారుల ఖాతాల్లోనే నేరుగా పింఛన్ నగదు జమ చేయనున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 1వ తేదీన ఖాతాలకు పింఛన్ సొమ్ము జమవుతుందన్నారు. ఒకవేళ ఆధార్ బ్యాంకు ఖాతాలకు జమకాని పింఛన్ దారులకు నేరుగా ఇళ్ల వద్దకు వచ్చి పింఛన్ అందజేయనున్నట్లు తెలిపారు. అయితే పింఛన్‌దారులు ఎవరూ సచివాలయాలకు వెళ్లవద్దన్నారు. ఒకవేళ ఏ కారణం చేతనైనా పింఛన్ జమకాకుండా మే 3న ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ అందజేయనున్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

పుట్లూరు : మండలవ్యాప్తంగా గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఎంపిడిఒ దస్తగిరి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి రాఘవరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య రాకూడదన్నారు. అదేవిధంగా 30తేదీ బ్యాంకుకు వెళ్లి పెన్షన్ డబ్బులు డ్రా చేసి 1వ తేదీ ఖచ్చితంగా పంపిణీ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా విధులు

వజ్రకరూరు : అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండి అక్రమ రవాణాలను అరికట్టాలని గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని అంత్రర్‌రాష్ట్ర చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం అప్రమత్తంగా ఉండూ అక్రమ రవాణా జరగకుండా గట్టి నిఘా వేయాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. కర్నాటకకు వెళ్లొచ్చే ప్రతి వాహనాన్నీ తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు.

ప్రజలకు మేలు చేసే జగన్‌ను ఎన్నుకుందాం

ఎం. వీరాంజనేయులు

ప్రజాశక్తి-నార్పల

కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ మేలు చేసే సిఎం జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రి చేసుకుందామని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని బొమ్మకుంటపల్లి, బి.పప్పూరు, మంగపట్నం, సోదనపల్లి, గుంజేపల్లి, నల్లపరెడ్డిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ "ఫ్యాన్" గుర్తుకు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జగనన్న ప్రకటించిన మేనిఫెస్టో అన్నివర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతిహామీని కచ్చితంగా నెరవేర్చే నాయకుడు జగనన్న ఒక్కరే అన్నారు. కావున టిడిపి మాయమాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దని సూచించారు. అమలు చేయలేని హామీలను చెబుతూ ప్రజల్ని మభ్యపెట్టడానికి టిడిపి సూపర్ సిక్స్‌తో మీ ముందుకు వస్తోందన్నారు. వీటిని ప్రజలు గమణించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, మొరుసు రమణారెడ్డి, మొరుసు సంజీవరెడ్డి, దిద్దికుంట కేశవరెడ్డి, మిద్దె కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పుట్లూరు : మండల పరిధిలోని గరుగుచింతలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ మల్లికార్జునస్వామి, ఎంపిడిఒ దస్తగిరి, ఎస్ఐ హేమాద్రి సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయా కేంద్రాల్లో విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలను పరిశీలించి స్థానిక సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం ఓటర్లకు ఓటరు స్లిప్పులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ క్రిష్టప్ప, విఆర్ఒ అంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన ఓ యువకుడు సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీకాంత్ కొన్నిరోజులుగా కుటుంబ సమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెందిన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

గుత్తి : మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల్ నుంచి ఖాళీ గ్యాస్ సిలిండర్లతో వడియంపేటకు వెళ్తున్న లారీ వెనకవైపు నుంచి హైవే డివైడర్ల మధ్య ఉన్న చెట్లకు నీళ్లు పోస్తున్న ట్యాంకర్‌ను ఢీకొంది. ప్రమాదంలో శింగనమలకు చెందిన లారీ డ్రైవర్ రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసులో వ్యక్తికి పదేళ్ల జైలు

అనంతపురం క్రైం : అనంతపురం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో మూడున్నరేళ్ల కిందట జరిగిన మైనర్‌పై అత్యాచారం కేసులో స్థానిక ధర్మభిక్షు కాలనీకి చెందిన షేక్‌బాషా అలియాస్ ఆత్మకూరు బాషాకు పదేళ్ల జైలుశిక్ష, రూ.3,000 జరిమాన విధిస్తూ అనంతపురం పోక్సో కేసుల స్పెషల్ కోర్టు జడ్జి టి.రాజ్యలక్ష్మి తీర్పు వెలువరించారు. అంతేకాకుండా బాధితురాలికి రూ.2.50 లక్షల పరిహారం అందించేలా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పిపి విద్యాపతి వాదించారు. అనంతపురం రూరల్ డీఎస్పీ బి.వెంకటశివారెడ్డి, అనంతపురం రూరల్ సి.ఐ రామకృష్ణారెడ్డి, కోర్టు మానిటరింగ్ సిస్టం సి.ఐ విశ్వనాథచౌదరి పర్యవేక్షణలో కోర్టు లైజన్ ఆఫీసర్ ఏఎస్సై శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాసులు, కోర్టు కానిస్టేబుళ్లు నాగార్జున, రజాక్, రాంమోహన్ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచి, నిందితులకు శిక్ష పడేందుకు తమవంతు కృషి చేశారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని పలు గ్రామాల్లో తెలుగుదేశం పార్టీలోకి వైసీపీ మద్దతుదారులు చేరారు. వీరజిన్నియ్యపల్లి, చెర్లోపల్లి గ్రామాలకు చెందిన దాదాపు వంద వైసీపీ కుటుంబాలు సోమవారం నాడు టిడిపిలో చేరాయి. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వారికి కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పుట్టపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర గెలుపునకు కృషి చేస్తామని వారు తెలియజేశారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

నగదు స్వాధీనం

ముదిగుబ్బ : మండలంలోని పట్నం పోలీస్ స్టేషన్ సమీపన జాతీయ రహదారిపై పోలీసులు చేపట్టిన తనిఖీలో పట్టుబడింది. సోమవారం వేకువజామున 1:30 గంటల సమయంలో కదిరి వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం ఆపి తనిఖీ చేయగా అందులో ఉన్న రఫీ, ఆంజనేయులు వద్ద రూ. 1,79,500, కౌలేపల్లి అంజి అనే వ్యక్తి నుంచి రూ.4,66,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటికి సంబంధించి ఎలాంటి రసీదులో లేకపోవడంతో సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, GOOTY
O.S. 220/2017

Between:
V.Mounika ...**Plaintiffs**
V.Hemachandra Reddy
And
V. Lakshmi Devi and others ...**Defendants**

7వ ప్రతివాదికి దావా సమన్లు

D7 : Bogathi Sulochanamma D/o Late V.Narayana Reddy (W/o Adinarayana Reddy)Cultivation, R/o Namananka Palli(V) Peddapappuru (M) Anantapur (D).

వాదులు దావా షెడ్యూలు భాగపరిష్కారము కొరకు పై కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరి దావా నీ హాజరు నిమిత్తము 08-05-2024వ తేదికి వాయిదా వేసియున్నారు. అందుకు నీకు ఏమైనా అక్షేపణలున్న యెడల మీరు ఆ దినం ఉ.10:30 గం॥లకు స్వయంగా గానీ వకీలు ద్వారా కాని హాజరు కావలెను. లేని యెడల దావాను నీ పరోక్షమున తీర్మానించెదరు.

G. Venkata Reddy
వాదిపరం వకీలు, గుత్తి

PUBLIC NOITCE

This Public Notice is hereby given on behalf of my client REPCO Home Finance Limited, Anantapuramu that one Smt Parimi Sobha Rani W/o Parimi Ramakrishna, residing at Door No. 2-138, Janmaboobi Nagar, Rapthadu Village, Rapthadu Mandal, Anantapuramu District, approach my client's company REPCO Home Finance Limited, Anantapuramu for going to Mortgage the below mentioned property as security by way of Regd. Mortgage the Original Regd. Sale Deed dt. 13.02.2019 with Doc.No. 1835/2019 executed by Maddepalli Surya Prakash in favour Parimi Sobha Rani, if any one has claims objections shall be informed to the below mentioned address or my client company's REPCO Home Finance Limited, Anantapuramu with in 7 days from the date of this public notice, otherwise the loan will be sanctioned treating that there are no objections to sanction loan on the security of the schedule property.

SCHEDULE OF THE PROPERTY

Property situated in R.D. of Anantapuramu and S.R.D. of Anantapuramu Rural within the limits of Rapthadu Grama Polam and Grama Panchayth with the following description.

Nature	Sy.No.	A.C.	H.S.	Plot No.
Govt.Dry	1-2 piki	0.02	0.08	34

Bounded by:
East: Plot No.33, South: Plot No.48
West:Plot No.35, North: Road.

Total Extent: Ac.0.02 cents or 96.8 5q. Yards

P.SARATH BABU,
Advocate, Anantapuramu.
Mobile: 9440508551, 8639444475

కాంగ్రెస్ పాలనతోనే ప్రజలకు న్యాయం

ఎమ్మెల్యే అభ్యర్థి రంగన అశ్వర్థ నారాయణ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ ధర్మవరం ఎమ్మెల్యే రంగన అశ్వర్థ నారాయణ తెలిపారు. ప్రచారంలో భాగంగా సోమవారం నాడు పట్టణంలోని గాంధీ నగర్ మెయిన్ బజార్, శ్రీదేవి థియేటర్ రోడ్డు వరకు ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను తప్పక అమలు చేసి తీరుతామని తెలిపారు. చేనేతకు జీఎస్టీని మినహాయింపు చేస్తామని చెప్పారు. సిఎఎ, ఎన్ఆర్సి, ఎన్పిఆర్, యుసిసి చట్టాలను రద్దు చేస్తామని తెలిపారు. రైతు రుణమాఫీ రెండు లక్షల వరకు చేస్తామన్నారు. వీటితో పాటు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాహీర్, నారాయణస్వామి, మునఫ్, జాఫర్, కరీం, సాయి, శంకర్, రాజు, మన్సూర్ పాల్గొన్నారు.

ధర్మవరం అసెంబ్లీ బరిలో 15 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్


వెంకటరామిరెడ్డి (వైసిపి)


సత్యకుమార్ (బిజెపి)


రంగన అశ్వర్థనారాయణ (కాంగ్రెస్)

ధర్మవరం శాసన సభ ఎన్నికల్లో 15 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ధర్మవరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివరామిరెడ్డి తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ఉండగా ఎవరూ వారి నామినేషన్లను ఉపసంహరించుకోలేదదన్నారు. అసెంబ్లీ బరిలో భారతీయ జనతా పార్టీ తరపున సత్యకుమార్ యాదవ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ తరపున రంగన అశ్వర్థనారాయణ, బహుజన సమాజ్ పార్టీ తరపున సాకే వినయ్‌కుమార్, జైభీమ్ భారత్ పార్టీ తరపున ద్వారా శంకర్, నవతరం పార్టీ తరపున షేక్ అయాజ్, స్వతంత్ర అభ్యర్థులుగా ఇలియాజ్ అహమ్మద్ సయ్యద్, ఈశ్వర్‌రెడ్డి మాచిరెడ్డి, జోగన్నగారి సూర్యనారాయణ, దాసరి కవిత, ఎం.ధనంజయ బిల్లే నరేంద్ర, బీరే సోమశేఖర్, రవీంద్రరెడ్డి, డి.శ్రీనివాసులునాయక్‌లు బరిలో ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు

చిలమత్తూరు : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపిపి పురుషోత్తమరెడ్డి, ఎంపిడిఓ రాంకుమార్ సూచించారు. సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ మండలంలోని 35 గ్రామాల్లో నీటి ఎద్దడి అధికంగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయా గ్రామాల్లో సత్వరమే చర్యలు చేపట్టి నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులను, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.

ఒక్కటైన తటస్థ నేతలు..!

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తి పట్టణంలోని టిడిపి నాయకులు కొందరు గత ఐదేళ్లుగా రాజకీయాలకు దూరంగా తటస్థంగా ఉంటూ వచ్చారు. ప్రస్తుత ఎన్నికల సమయంలో వీరంతా ఒక్కటయ్యారు. సోమవారం పట్టణంలోని పోతురాజు కేశప్ప కుటుంబం పల్లె రఘునాథ్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చెన్నకేశవులు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కడియాల రామ్మోహన్ పాల్గొన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపిలో ఉన్న వీరు కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు. వీరితో టిడిపి యువ నాయకులు చర్చలు జరిపి తిరిగి పార్టీలో క్రియాశీలకంగా పని చేయాలని కోరడంతో వారు అంగీకరించారు. ఇప్పటికే పట్టణంలో యువ నాయకులు రామ్ లక్ష్మణులు కూటమి అభ్యర్థుల గెలుపునకు విస్తృత ప్రచారం చేస్తున్నారు. నాయకులంతా ఏక తాటిపైకి వస్తుండడంతో పుట్టపర్తిలో టిడిపి మరింత బలోపేతం అవుతుందని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో రామ్, లక్ష్మణ్, పట్టణ పార్టీ కన్వీనర్ రామాంజనేయులు, మాజీ పుడా ఛైర్మన్ కడియాల సుధాకర్, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు గూడూరు ఓబులేసు పాల్గొన్నారు.

బ్యాంకు వద్ద రైతు సొమ్ము చోరీ

రాయదుర్గం : పట్టణంలోని తేరు వీధిలో ఉన్న యూనియన్ బ్యాంకు కార్యాలయం వద్ద సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు ఓ రైతుకు చెందిన రూ. 3.7 లక్షలు అపరించారు. వివరాలు.. మండలంలోని పల్లేపల్లి గ్రామానికి చెందిన రైతు తిప్పారెడ్డి పంట రుణం రెన్యువల్ చేసేందుకు రూ. 3.7 లక్షలు సొమ్ము తీసుకొచ్చాడు. అధికారులు పంట రుణం రెన్యువల్ మంగళవారం చేస్తామని చెప్పడంతో అతడు నగదును తన స్కూటీ సీటు డిక్కీలో ఉంచగా గుర్తుతెలియని అగంతకుడు సీట్ కవర్ తెరిచి అందులో ఉంచిన నగదు ఎత్తుకెళ్లాడు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

రొద్దం : మండలంలోని దొడఘట్ట గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దొడఘట్ట గ్రామానికి చెందిన బోయ ప్రహ్లాద(43) సోమవారం ఉదయం మృతి చెందారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రొద్దం : మండలంలోని పెద్దగువ్వలపల్లి గ్రామానికి చెందిన అంజనరెడ్డి(45) గత శనివారం గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురంలో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఆయన మృతి చెందాడు.

మొదటి పేజి తరువాయి

ప్రచార వేడి..!

ప్రచారం చేయడం అభ్యర్థులకు కొత్తకష్టాలు తెచ్చిపెడుతున్నాయి. మండుతున్న ఎండల బారి నుంచి తప్పించుకుని ప్రచారం చేయడం కష్టం అవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉదయం 6 నుంచి 11 గంటలు, సాయంత్రం 5 నుంచి రాత్రి వరకు ప్రచారం చేసుకునేలా అభ్యర్థులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

పోటాపోటీగా ప్రచారాలు

ఎన్నికలు నువ్వానేనా అన్నట్లు ఉండడంతో అభ్యర్థులు ప్రచారాలను పోటాపోటీగానే నిర్వహిస్తున్నారు. ఎండ వేడిమికి భయపడి ప్రచారంలో వెనుకబడితే ప్రత్యర్థి పార్టీ ముందుకు వెళ్లే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యర్థి పార్టీకి అవకాశం ఇవ్వకుండా అభ్యర్థులు ప్రచారాన్ని ఓ ప్రణాళిక ప్రకారం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. గత ఎన్నికల్లో ఎక్కువగా రోడ్‌షోలు నిర్వహించి ప్రచారాలు చేసేవారు. ప్రస్తుతం మండుతున్న ఎండలకు జనం రోడ్‌షోల వద్దకు వచ్చి నాయకుల ప్రసంగాన్ని వినే పరిస్థితి కన్పించడం లేదు. దీంతో అభ్యర్థులే ఇళ్ల వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇంటింటికీ ప్రచారం చేయడం ద్వారా అభ్యర్థి స్వయంగా ఓటరును కలిసి ఓట్లు అడిగే అవకాశం ఉంటుంది. దీని వల్ల ఓటరును మాట్లాడించి ఓటును ఖచ్చితంగా వేయించుకునేందుకు కూడా అవకాశం ఉంటుందన్న భావన అభ్యర్థులు కన్పిస్తోంది. టిడిపి, వైసిపి, కాంగ్రెస్ వేదిక అభ్యర్థులు అందరూ కూడా ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటి ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.

సామాజిక మాధ్యమాల్లోనూ ప్రచారం

మండుతున్న ఎండల నేపథ్యంలో అభ్యర్థులు సామాజిక మాధ్యమాలను కూడా ప్రచార సాధనాలుగా ఉపయోగించుకుంటున్నారు. ప్రతి అభ్యర్థి సాంకేతిక పరిజ్ఞానం కలిగిన కొందరని వారి వద్ద ఉంచుకుని వారి చేసే ప్రచారాలు, ఎన్నికల మ్యానిఫెస్టో తదితర వాటిని అభ్యర్థుల సెల్‌ఫోన్లకు పంపుతున్నారు. ముఖ్యంగా వాట్సాప్‌ను ఎక్కువగా ఉపయోగించుకుని ఆయా గ్రామాలు, వార్డుల్లో గ్రూపుల్లో వేస్తున్నారు. ప్రతి అభ్యర్థి వద్ద ఇందుకోసం ఓ ప్రత్యేక సోషల్ మీడియా బృందం ఈ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఎస్ఎంఎస్‌లు, వాయిస్ సందేశాల ద్వారా ఓటును అభ్యర్థిస్తూ ప్రచారాలు చేస్తున్నారు. ఎండ వేడిమి నేపథ్యంలో అభ్యర్థులు ఇలాంటి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రచారాలు చేస్తూ ముందుకు సాగుతున్నారు.



ప్రచారం చేస్తున్న అమిలినేని సురేంద్రబాబు

సురేంద్ర బాబుకు అపూర్వ ఆదరణ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఎన్నికల ప్రచారంలో భాగంగా టిడిపి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుకు అపూర్వ ఆదరణ లభిస్తోంది. సోమవారం నాడు కుందుర్పి మండలం నిజువల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలు సురేంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. గ్రామ పురవీధుల్లో రోడ్ షో నిర్వహిస్తూ వైసిపి ప్రభుత్వ అరాచకాలను అమిలినేని ఎండగట్టారు. ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రజాస్వామ్యం అతలాకుతమైందని మండిపడ్డారు. కనీసం పాఠ్యపుస్తకాల్లో రాజధాని పేరు కూడా లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇలాంటి దౌర్భాగ్య ప్రభుత్వానికి చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని దుయ్యబడ్డారు. అన్ని వర్గాల ప్రజలు ఏకమై ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ వైసిపి అరాచకాలను ఎండగట్టాలన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ధనుంజయ, నరసింహప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామ్ లక్ష్మణ్‌లకు మాజీ డిజిపి శంకర్ రెడ్డి అభినందన

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పట్టణంలో టిడిపి విజయానికి కృషి చేస్తున్న యువ నాయకులు రామ్ లక్ష్మణులను మాజీ డిజిపి శంకర్ రెడ్డి అభినందించారు. సోమవారం ఛత్రపతి రహదారిలో గల రామ్ లక్ష్మణ్ కార్యాలయంలో వారిని కలిసి అభినందనలు తెలిపారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి స్వయాన శంకర్ రెడ్డి కూతురు కావడంతో ఆమె గెలుపునకు శంకర్‌రెడ్డి కూడా తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె సింధూరకు నియోజకవర్గంలో మంచి ఆదరణ లభిస్తోందన్నారు. రాష్ట్రం అభివద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. రామ్‌లక్ష్మణ్ లాంటి యువత ఎన్నికల్లో కష్టపడితే టిడిపి విజయం ఖాయమన్నారు.

సచివాలయ ఉద్యోగికి నోటీసు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఎన్నికల కోడ్ ఉల్లంఘన విషయంలో సచివాలయ ఉద్యోగికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నెల 13 వ తేదీన కొత్త చెరువులో టీడీపీ ఎన్నికల ప్రచారంలో చిలమత్తూరు సచివాలయం-1 ఉద్యోగి పాల్గొన్న పోటోలు,వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ విషయంలో అధికారులు ఉద్యోగిని కాపాడేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి అధికారులు సంబందిత సచివాలయ ఉద్యోగికి సోకాజ్ నోటీసు ఇచ్చినట్లు సమాచారం.కోడ్ ఉల్లంఘనపై ఈ నెల 13న ఘటన జరిగితే ఇప్పటి వరకు ఎంసిసి అధికారులు ఎందుకు ఆలస్యం చేసారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా పోటో,వీడియోలు సచివాలయ ఉద్యోగి క్లారిటీగా కనపడటం లేదని దీంతో ఎవరైన సంబందిత ఉద్యోగిని ఉద్దేశ పూర్వకంగా ఇరికించారా అన్న అనుమానాలు సైతం వ్యక్తం అవుతున్నాయి.

వడ్డెర్లను మోసం చేస్తున్న టిడిపి

పుట్టపర్తి క్రైమ్ : వడ్డెర్లను టిడిపి 25 ఏళ్లుగా మోసం చేస్తోందనివడ్డెర్ల సంఘం నాయకులు విమర్శించారు. ఈ మేరకు వారు సోమవారం పుట్టపర్తి పట్టణ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో టిడిపి రెబల్ అభ్యర్థిగా వడ్డెర కమ్యూనిటీ నుంచి వేసిని వ్యక్తి తన నామినేషన్‌ను ఉపసంహరించుకునన్నారని అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు ఆయనకు ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పి విత్‌డ్రా చేయించినట్లు తెలిసిందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలోని వడ్డెరలు అందరూ ఏకతాటిపై వచ్చి టిడిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. టిడిపి పార్టీకి కాకుండా ఏ పార్టీకి ఓటు వేసినా తమకు అభ్యంతరం లేదని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు డాక్టర్ తిరుపతేంద్ర, వడ్డే భాస్కర్, వడ్డే మారెప్ప, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
అనంతపురం
మంగళవారం 30 ఏప్రిల్ 2024

కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుందాం



ఉరవకొండలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం



పుట్టపర్తిలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-వజ్రకరూరు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమితోపాటు వైసిపి ప్రభుత్వాన్ని ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుందామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.మధుసూదన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి మల్లికార్జున పిలుపునిచ్చారు. సోమవారం ఉరవకొండ పట్టణంలోని 1, 11వ వార్డుల్లో సిపిఎం, సిపిఐ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి పదేళ్లుగా టిడిపి, వైసిపి ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ప్రజలను నట్టేట ముంచాయన్నారు. బిజెపికి కొమ్ముకాస్తూ టిడిపి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టాయన్నారు. రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఉరవకొండ మండల కన్వీనర్ మధుసూదన్, కాంగ్రెస్ నాయకులు నిఖిల్‌నాథ్‌రెడ్డి, సోనియా సీన, అబ్బాస్, సుధాకర్, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తండ్రి గెలుపు కోసం తనయుడు ప్రచారం

వై.మధుసూదన్‌రెడ్డి గెలుపు కోసం తనయుడు వై.అవినాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా వజ్రకరూరు మండల పరిధిలోని పందికుంట గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి కుమార్తె ప్రియా లిఖిత, కోడలు దర్శనారెడ్డి, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు

పుట్టపర్తి అర్బన్ : దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఇండియా వేదిక అభ్యర్థి దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం నల్లమాడ మండలంలోని దున్నికోట, పులగంపల్లి, ఎర్ర చెరువుపల్లి, వెంకటరెడ్డి పల్లి, మసకవంకపల్లి గ్రామాల్లో విస్తతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిడిపి, వైసీపీకి ఓటు వేస్తే బిజెపికి ఓటు వేసినట్లేనని అన్నారు. రైతుల పట్ల ఈ రెండు పార్టీలకు చిత్తశుద్ధి లేదన్నారు. అందుకే రుణమాఫీ ప్రస్తావన ఇరుపార్టీల మేనిఫెస్టోలో పెట్టలేదన్నారు. కేంద్రంలో బిజెపి రైతులకు, నిరుద్యోగులకు, మహిళలకు చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో జగన్ పాలన అరాచకం, భూకబ్జాలతోనే సరిపోయిందని విమర్శించారు. ఈసందర్భంగా దోన్నికోటలో యనమల ప్రసాద్ నాయుడు కుటుంబంతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మధుసూదన్ రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి, నల్లమాడ మండల అధ్యక్షులు పఠాన్ గౌస్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కదిరప్ప, సిపిఐ నాయకులు చంద్ర, గంగాద్రి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు సంతోష్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, నరేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఎన్నికల ప్రచారం



కందికుంటకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న పల్లె కృష్ణకిషోర్‌రెడ్డి

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి మండల పరిధిలోని ఇరగలపల్లి పంచాయతీ లోని తిప్పాబట్టపల్లిలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన 25 కుటుంబాలు వైసీపీని వీడి టిడిపిలో చేరాయి. పార్టీలోకి చేరిన వారికి టిడిపి కండువాలు వేసి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన వెంకట నారాయణ, ఇరగలపల్లి ఉపసర్పంచ్ శ్రీరాములు, ప్రణీత, మాజీ సర్పంచ్ నిర్మల, శ్రీధర్, శ్రీనివాసులు, జయరాం, వెంకటరాముడు ,వెంకటాచలం, సీనా వెంకటాచలం ,గోపాల్ నాయక్, హరీష్ ,మధుసూదన్, పేరుతోపాటు మరికొందరు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పల్లె కృష్ణకిషోర్ రెడ్డి, మాదినేని ఆదినారాయణ, హరీష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వందలాది మంది వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరారు. వైసిపి విధివిధానాలు నచ్చక టిడిపిలో చేరుతున్నట్లు వారు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ గెలుపునకు కృషి చేస్తాని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్లపెంట : టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల పరిధిలోని గొడ్డివెలగల దాసరవాండ్లపల్లి, వీరన్న గట్టుపల్లి, వంకలోపల్లి, టీ పెద్ద తండా, గరుగుతండా, సాతలవాండ్లపల్లి తదితర గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కదిరి వాల్మీకి విదాసంస్థల అధినేత పవన్ కుమార్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ సి కొండయ్య, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు ఏ వెంకటరమణారెడ్డి, సర్పంచులు శివప్ప నాయుడు, మాజీ ఎంపీపీ గంగరాజు, మాజీ సర్పంచి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

బుక్కపట్నం : కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర రెడ్డికి మద్దతుగా టిడిపి స్థానిక నాయకులు మండల కేంద్రంలోని కోటవీధిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం రూపొందించిన సూపర్ సిక్స్ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్‌బాషా, అశోక్, భాస్కర్ రాయల్, మన్సూర్, నాగభూషణం, మనోహర్, బాబా, జబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మహిళా పక్షపాతి చంద్రబాబు నాయుడు అని పెనుగొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ అన్నారు. మండలంలోని కాలువపల్లి నిషా గార్మెంట్స్ లో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు ప్రథమ ప్రాధాన్యతనిచ్చామన్నారు. ప్రతి మహిళకు ఉపాధి అవకాశాలు ఇవ్వాలని ఉద్దేశంతో ముందస్తు ఆలోచనతో ఏర్పాటుచేసిన దిశా గార్మెంట్స్ ఎంతోమంది నిరుపేద మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతున్నదన్నారు. చంద్రబాబుకు మహిళలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గార్మెంట్స్ యాజమాన్యంతో పాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.


ఓబుళదేవర చెరువు : పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పల్లె సింధూరను గెలిపించాలని టీడీపీ యువ నాయకుడు పల్లె వెంకటకృష్ణకిషోర్ రెడ్డి ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓడి చెరువు మండలం కుసుమ వారిపల్లి మామిళ్ళకుంట్లపల్లి పంచాయతీలోని ఎం కొత్తపల్లి ,వడ్డీవారిపల్లి తోట్లిపల్లి ,మామిళ్లగుంట్లపల్లి గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోజనసేన నాయకులు కొండ బయన్న సతీష్, మండల కన్వీనర్ జయచంద్ర, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్ ,అంజినప్ప, మండోజి ఆరిఫ్ ఖాన్, డాక్టర్ జాకీర్ అహ్మద్, షానవాజ్ ,ఇర్షాద్, ఎద్దుల ప్రమోద్ కుమార్ రెడ్డి , రాజారెడ్డి, రామాంజి, బోర్ రమణ ,తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం కదిరి రూరల్ మండలం వీరన్న గట్టుపల్లి, కొత్త రామపురం, పత్తి గడ్డ, ముష్టిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మినీ మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ కు సంబంధించిన అంశాలను ప్రజలకు వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని కోట్లపల్లి, సూరగానిపల్లి, నిడిమామిడి గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సింధూరను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కంసల నారాయణస్వామి, నాగిరెడ్డి, వెంకటేశు, మణికుమార్, రామాంజనేయులు, నక్కా వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : 27వ వార్డు వైసిపి కౌన్సిలర్ నాగేంద్రమ్మ సోమవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈమెకు బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి పార్టీ కండువా వేసి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డిఇ. రమేష్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ జెవిఎస్ అనిల్, నాయకులు గణేష్, రవి, నాగర్జున, హిదాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : రూరల్ మండల కేంద్రంలోని వెంగళమ్మ చెరువు పంచాయతీ వీర చిన్నయ్య పల్లిలో పలువురు టిడిపిలో చేరారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి టిడిపి యువ నాయకుడు రామ్ లక్ష్మణ్ ఆధర్వంలో వీరంతా టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, వడ్డే తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.



'పురం' అసెంబ్లీ స్థానానికి 13 మంది పోటీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో నుంచి 13 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషేక్ కుమార్ వెల్లడించారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ల ప్రక్రియ పూర్తి అయిన అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను, వారి గుర్తులను వివరించారు. కాంగ్రెస్ ఎం.హెచ్ ఇనాయతుల్లా, వైసిపి టిఎన్. దీపిక, టిడిపి నందమూరి బాలకృష్ణ, బిఎస్‌పి శ్రీరాములు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి పార్టీ కోడమూరు నౌషాద్‌తో పాటు పలువురు బరిలో నిలిచారు.



కాంగ్రెస్ అభ్యర్థి ఇనాయతుల్లా



వైసిపి అభ్యర్థి దీపిక



టిడిపి అభ్యర్థి బాలకృష్ణ



టిడిపి అభ్యర్థి కందికుంట



వైసిపి అభ్యర్థి మక్బూల్



కాంగ్రెస్ అభ్యర్థి షాన్వాజ్

కదిరి అసెంబ్లీ బరిలో 13 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరి నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికలకు 13 మంది బరిలో ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వంశీకృష్ణ తెలిపారు. టిడిపి నుంచి కందికుంట వెంకటప్రసాద్, వైసిపి విఎస్ మక్బూల్ అహ్మద్, కాంగ్రెస్ షాన్వాజ్, బహుజన పార్టీ రామచంద్ర, స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఆయన తెలిపారు.

హిందూపురం పార్లమెంట్ ఎన్నికల బరిలో 13 మంది

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

హిందూపురం పార్లమెంటు స్థానానికి నామినేషన్లు ఉపసంహరణ గడువు అనంతరం బరిలో 13 మంది ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి అరుణ్ బాబు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 24 మంది నామినేషన్లు వేయగా పరిశీలనలో 9 నామినేషన్లు తిరస్కరించామన్నారు. ఇద్దరు అభ్యర్థులు ఉపసంహరించుకున్నారన్నారు. స్వతంత్ర అభ్యర్థి ఎస్. గంగాధర్, మరో స్వతంత్ర అభ్యర్థి హెచ్.డి మంజుల గౌడ్ నామినేషన్లను ఉపసంహరించుకున్నారన్నారు. దీంతో పార్లమెంటు స్థానానికి 13 మంది ఎన్నికల బరిలో ఉంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

జగన్‌పై 'బాబు' వ్యాఖ్యలు సంకుచిత బుద్ధికి నిదర్శనం

ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి వై. విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-వజ్రకరూరు

సిఎం జగన్ వినాశనాన్ని కోరుతూ టిడిపి అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఆయన సంకుచిత బుద్ధికి నిదర్శనమని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఉరవకొండలోని 5, 6వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా మల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక నేతలతో కలిసి ఇంటింటికీ ప్రచారం చేపట్టారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తర్వాత ప్రచార రథంపై రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో జరిగిన సభలో 'జగన్మోహన్‌రెడ్డి.. రేపు నిన్ను చంపితే ఏమవుతుంది' అంటూ చంద్రబాబు బరితెగించి చేసిన వ్యాఖ్యలపై వై.విశ్వేశ్వరరెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకే ఆయన్ను భౌతికంగా నిర్మూలించేందుకు చంద్రబాబు కుతంత్రం పన్నుతున్నారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. జగన్ మరోసారి సిఎం అయితేనే రాష్ట్రంలో పేదరికం లేకుండా పోతుందన్నారు. ఆయన తెచ్చిన సంస్కరణలు దేశానికే ఆదర్శమన్నారు. ఐదేళ్ల పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. మీకు మంచి జరిగి ఉంటేనే ఓటు వేయాలని జగన్ ప్రజలను అడుగుతుంటే.. ప్రతిపక్షాలకు దిక్కు తోచక నిరాశ, నిస్పృహలతో ఇష్టమొచ్చినట్లు నోరు పారేసుకుంటున్నారని విమర్శించారు. వీరు చేసే విమర్శలతో జగన్‌పై రోజురోజుకూ ఆదరణ పెరుగుతుందే తప్ప తగ్గదన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా జగన్‌కే ఓటు వేయాలని ప్రజలు నిర్ణయించారని వెల్లడించారు.

'కూటమి' బూటకపు హామీలు నమ్మొద్దు

టిడిపి, జనసేన, బిజెపి కూటమి బూటకపు హామీలు, మాయమాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దని యువజన విభాగం రాయలసీమ జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జి ప్రణయ్‌రెడ్డి సూచించారు. సోమవారం విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుష్పావతి భీమిరెడ్డి, హనుమంతు, భరత్‌రెడ్డి, శ్రీరాములు, కరణం భీమిరెడ్డి, ఓబులేష్, దాసరి లక్ష్మి, షణ్ముఖగౌడ్, శివ, రాజశేఖర్, డిష్ వెంకటేష్, వెంకటేష్, నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని బూదవర్తి, శ్రీరంగపురం, నక్కలపల్లి గ్రామాల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం అధికారం కోసం కూటమి ప్రజల్లోకి వస్తోంది తప్ప ప్రజల సంక్షేమం కోసం కాదన్నారు. కావున ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దన్న, రామాంజనేయులు, త్రిలోకనాథ్‌రెడ్డి, చిన్న మచ్చన్న, పి.శ్రీనివాసులు, బి.శివలింగప్ప, జి.శ్రీనివాసులు, వరలక్ష్మి, సాహితరెడ్డి, రామిరెడ్డి, మారుతీరెడ్డి, రేఖమ్మ, వెంకట్‌రెడ్డి, రవినేపల్లి, రమేష్, అనిల్, నక్కలపల్లి భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి మాధవ రెడ్డి పోలీస్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. పోలింగ్ కేంద్రాలు, ఈ.వీ.ఎం, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతు సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగాలంటే పోలింగ్ కేంద్రాలు, ఈ వీ.ఎం, స్ట్రాంగ్ రూమ్ లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద స్థానిక పోలీసులు, కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం హిందూపురం రూరల్ మండలం గుడ్డంపల్లి వద్ద ఉన్నా బిట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కొట్నూర్, హిందూపురంలోనిఎంజీఎం, రహమంతపూర్, మోడల్ కాలనీ, పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో ఏర్పాటు చేసిన సరిహద్దులో ఉన్న బార్డర్ చెక్ పోస్ట్ లను జిల్లా ఎస్‌పి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి కంజాక్షన్, సిఐలు శ్రీనివాసులు, రియాజ్ అహ్మద్, ఈరన్న, శ్రీనివాసులు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - కదిరి టౌన్

వచ్చే ఎన్నిలలో వైసిపిని ఆదరించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ ఓటర్లను కోరారు. సోమవారం కదిరి మున్సిపల్ పరిధిలోని 35 వార్డు, కదిరి రూరల్ మండల పరిధిలోని మొటుకు పల్లి, కౌలేపల్లి గ్రామాలలోని స్థానిక నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వైసిపితోనే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందని అన్నారు. అమలుకు సాధ్యమయ్యే హామీలను జగనన్న ఇస్తుంటే ఓర్వలేని టిడిపి నాయకులకు భయం పట్టుకుందని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, పరికి షాదిక్‌బాషా, వైస్ చైర్మన్ అజ్జుకుంట రాజశేఖర్ రెడ్డి, లీగల్ సెల్ జోనల్ ఇన్‌ఛార్జి లింగాల లోకేశ్వర్ రెడ్డి, మాజీ టెంపుల్ చైర్మన్ గోపాలకృష్ణ, పార్టీ యువ నాయకులు ప్రణీత్ రెడ్డి, జడ్పిటిసి భూక్యా రాధాకృష్ణ నాయక్, కౌన్సిలర్ మురళి, జంపాల నాగేంద్ర, శీన, అశోక్ గిరిధర్, సర్పంచి రాము, ఎంపీటీసీ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు రూరల్ : వైసీపీ ప్రభుత్వముతోనే అభివద్ధి సాధ్యమని ఆపార్టీ మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ రాధా నాగరాజు, కాపునాడు జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ సూరి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పాదయాత్ర వాల్మీకి శంకర్ అన్నారు. ఈసందర్భంగా వారు కొత్త చెరువులోనే బసవన్న కట్ట వీధి, ముస్లిం కాలనీ, మేదర వీధిలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి వైసీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండ్ ప్రెసిడెంట్ నాగభూషణ్, వైస్ సర్పంచి యుగేందర్, ఎంపీటీసీ రఫీ, ఆవుల లక్ష్మీదేవి ,సోమశేఖర్ రెడ్డి షాజహాన్, వడ్డే నారాయణ, అంగడి సత్తి, ఎల్లప్ప, పెయింటర్ కేశవ తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మండలంలోని బాలిరెడ్డిపల్లి, శాసనకోట, బోరెడ్డిపల్లి, కోడిగనహళ్లి గ్రామాలలో వైసిపి పెనుగొండ ఎమ్మెల్యే అభ్యర్థి భర్త చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా శీరేకోళం, బోరెడ్డిపల్లి, మోద, శ్రీరంగరాజుపల్లిలోని కాంగ్రెస్, టిడిపి చెందిన పలువురు వైసిపిలో చేరారు. వీరికి చరణ్ రెడ్డి వైసిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ధనాపురం రామకృష్ణ, నయాజ్, నంజుండప్ప, ఆంజనేయులు, క్రిష్టప్ప, రామచంద్ర, శ్రీరాములు తదితరులు పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి చూసి పార్టీలోకి చేరామన్నారు.

బత్తలపల్లి :బత్తలపల్లిలో 50 రజక కుటుంబాలు ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. సోమవారం ధర్మవరం పట్టణంలోని ఎమ్మెల్యే కేతిరెడ్డి స్వగృహంలో వైసిపి మండల ఉపాధ్యక్షులు కోటి సురేష్‌కుమార్, మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సమక్షంలో రజకులు వైసిపిలో చేరారు. వీరికి కేతిరెడ్డి పార్టీ కండువాలు కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. శ్రీరాములు, నారాయణస్వామి, నాగేష్, తిరుపాలు, రామాంజనేయులు, సత్యప్ప, గంగాఢీ, శ్రీనివాసులు. నాగేంద్ర, ఎస్. నాగేంద్ర, మంజు, రామకృష్ణ, వెంకటరాముడు, రమణ, రాము, కాప్పు, ఆనందు, నాగభూషణ, మల్లిఖార్జున, రవి, కంబగిరి, పోతులయ్య, వెంకటనారాయణ, శేఖర్, ఓబుళపతి, హర్షవర్ధన్, రాహుల్, బ్రహ్మయ్య, లక్ష్మణ్, రాము, సురేష్ అడెప్ప, ఫోటో ఆనందు, రమేష్, నరసింహులు, నాగభూషణ, ప్రసాద్, గోవర్ధన్, డ్రైవర్ రమేష్, మంజునాథ్. ఆంజనేయులుతో పాటు పలు కుటుంబాలకు చెందిన వారు వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమతం ఈశ్వరయ్య, సహకార సంఘం డైరెక్టర్ ఈడిగ కాళప్ప నాయకులు విల్లే సూరి, యోగానందాచారి. ఆక్రియా, హోసన్, చర్మాల సురేష్, లోకేష్ మొసంపు, మందం నారాయణ. కమతం లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు గోకులం నుంచి దుద్దుకుంట అపర్ణ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ వార్డులోని ప్రధాన రహదారిలో రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, వైస్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మీ నారాయణ రెడ్డి, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీ నరసమ్మ, కన్వీనర్ రంగారెడ్డి, మెప్మా జిల్లా అధ్యక్షురాలు సాయిలీల రెడ్డి, సచివాలయాల కన్వీనర్ కవితా రెడ్డి, రామకష్ణ, కౌన్సిలర్ సాయినాథ్ యాదవ్, శంకర తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి నియోజకవర్గం నల్లమాడ మండలం పులగంపల్లి పంచాయతీకి చెందిన పలువురు టిడిపి కార్యకర్తలు వైసిపిలో చేరారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వారు వైసిపిలో చేరారు. సోమవారం పుట్టపర్తి వైసీపీ కార్యాలయంలో శ్రీధర్ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కొండే గంగి రెడ్డి, ఎం.నారాయణ రెడ్డి, చిన్న రెడ్డి, రాజా రెడ్డి, జగదీష్ చంద్ర బోష్, కోటయ్య, జె.కళ్యాణ్, కొండే మనికంటరెడ్డి ఏ.ఆదినారాయణ తదితరులు వైసిపిలో చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఎన్నో ఏళ్లుగా టిడిపిలో ఉన్నామని అయితే మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రవర్తన నచ్చకే వైసీపీలోకి చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లమాడ మండల వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా ఉందని వైసిపి అసెంబ్లి అభ్యర్థి దీపిక అన్నారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను తమతో పాటు రాష్ట్ర ప్రజలు స్వాగతిస్తున్నట్లు చెప్పారు. వైసిపి అభ్యర్థులకు ఓటు వేసి రాష్ట్ర అభివృద్ధికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ సమన్వయ కర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, కౌన్సిలర్ షాజియా, ప్రశాంత్ గౌడ్, నాగభూషణరెడ్డి, నారాయణ స్వామి, గంగిరెడ్డి, రాము, సుభాష్ గాంధి తదితరులు పాల్గొన్నారు.



మహిళా ఓటర్లతో మాట్లాడుతున్న అభ్యర్థి మక్బూల్



ప్రచారం నిర్వహిస్తున్న దుద్దుకుంట అపర్ణరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్

మే డేను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్

సోమందేపల్లి : మే డేను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. పెనుకొండ పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 1886లో అమెరికాలోని చికాగో నగరంలో కార్మిక వర్గం పెద్దఎత్తున పోరాటం చేసి 8 గంటల పని దినంను సాధించుకున్న రోజును మే డే గా నిర్వహించుకుంటున్నామన్నారు. అయితే మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే విధంగా చట్టాలు తీసుకొస్తుందన్నారు. అనేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడం పై మండిపడ్డారు. కార్మికుల ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, తిప్పన్న, మహబూబ్ బాషా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాసహాయ కార్యదర్శి గంగాధర్ పాల్గొన్నారు.

చెరువు మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని గలిబిపల్లి గ్రామానికి చెందిన రైతు అనుమతులు లేకుండా కుర్లపల్లి చెరువు నుంచి తన పొలానికి మట్టి తరలిస్తున్న 4 ట్రాక్టర్లు, ఒక జెసిబిని పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అలాగే ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ ఇరిగేషన్ కానీ, రెవెన్యూ శాఖ అధికారుల వద్ద కానీ తప్పనిసరిగా అనుమతి తీసుకొని చెరువుల్లోని మట్టిని తరలించాలన్నారు. అనుమతి లేకుండా మట్టి తరలిస్తే వాల్టా చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా గలిబిపల్లి గ్రామంలో ప్రయివేట్ ఫామ్ హౌస్ కోసం పది రోజులుగా మట్టి తరలిస్తుంటే పట్టించుకోని పోలీసులు రైతులు పొలానికి చెరువు మట్టి తరలిస్తే చర్యలు తీసుకోవడం ఏంటని ప్రజలు మండిపడుతున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం


ప్రజాశక్తి-రాయదుర్గం

బొమ్మనహాళ్ మండలంలోని హరే సముద్రం గ్రామానికి చెందిన ఈడిగ దేవేంద్ర భార్య జ్యోతికి సోమవారం రాయదుర్గం తాలూకా ఈడిగ సంఘం అధ్యక్షులు అశోక్ కుమార్ గౌడ్ రూ. 10వేలు అందజేశారు. ఇటీవల దేవేంద్ర తాను పండించిన మిర్చి పంటను అమ్మడానికి కర్నాటక వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న అశోక్‌కుమార్‌గౌడ్ దేవేంద్ర భార్య జ్యోతికి ఆర్థికసాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పంట దిగుబడిని విక్రయించడానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మిర్చి రైతు ఈడిగ దేవేంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వంద కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కదిరి టౌన్

నల్లచెరువు మండలంలోని కమ్మవారిపల్లి, యనమలవారిపల్లి, పత్రవాండ్లపల్లి గ్రామాలకు చెందిన వాలంటీర్లతో పాటు వంద వైసిపి కుటుంబాలు సోమవారం టిడిపిలో చేరాయి. పార్టీలో చేరిన వారందరికీ కదిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కందికుంట మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రతి ఒక్కరూ బూత్ స్థాయిలో శ్రమించి టిడిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో వైసిపికి గట్టిగా బుద్ధి చెప్పడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని కందికుంట తెలిపారు.


ఫొటో : కందికుంట సమక్షంలో టిడిపి చేరిన వైసిపి శ్రేణులు

జిల్లాలో పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్‌టీ

జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే మోహరించిన కేంద్ర సాయుధ పోలీసు బలగాలతో పాటు స్థానిక పోలీసులు అన్ని మండల కేంద్రాల్లో వాహనాలను తనిఖీ చేయడంతో పాటు బస్టాండ్, రైల్వే స్టేషన్లలో ముమ్మరంగా తనిఖీలు చేశారు. జిల్లాలోకి, పట్టణాల్లోకి ప్రవేశించే అంతర్రాష్ట్ర సరిహద్దుల మార్గాల్లో తనిఖీలు చేపట్టారు. రహదారులు, ప్రధాన కూడళ్లలో వెళ్తున్న బస్సులు, లారీలు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కర్నాటక సరిహద్దులో ఉన్న కొడికొండ చెక్‌పోస్టులో ప్రతి వాహనాన్ని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆధారాలు చూపించకుండా తరలించే నగదు, నగలు, ఇతరత్రా సొత్తులపై నిఘా వేశారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ. 50 వేలకు మించి నగదు తీసుకెళ్లరాదని, పెద్ద మొత్తంలో నగదు, ఆభరణాలు ఉంటే తప్పనిసరిగా వెంట సంబంధిత పత్రాలు ఉండాలని ఇదివరకే ప్రజలకు సూచించిన విషయం తెలిసిందే.

అంతర్రాష్ట్ర సరిహద్దులో..

రాయదుర్గం : పట్టణ శివారులోని గాలి మారెమ్మ దేవస్థానం వద్ద జాతీయ రహదారి-544 డిడి పై ఉన్న అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును సోమవారం కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు సందర్శించారు. వాహనాల రాకపోకల రిజిస్టర్‌ను పరిశీలించారు. కర్నాటక నుంచి వస్తున్న వాహనాలను ఆపి అందులో మద్యం, నగదు అక్రమ రవాణాపై సిబ్బందిచే తనిఖీలు చేయించారు. డీఎస్పీ మాట్లాడుతూ కర్నాటక నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. రాష్ట్రంలోకి అక్రమంగా మద్యం, నగదు, ఇతర తాయిలాలు ప్రవేశించకుండా నివారించాలన్నారు. చెక్‌పోస్ట్ గుండా వచ్చే వాహనాలతో పాటు సమీపంలోని కర్నాటక నుంచి రాష్ట్రంలో ప్రవేశించే ప్రతి అడ్డ దారి, రహదారిని తరచూ తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ కర్నాటక నుంచి ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మద్యం, నగదు, ఇతర కానుకలు రాష్ట్రంలో ప్రవేశించకుండా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఎస్పీతో పాటు రాయదుర్గం రూరల్ సిఐ ప్రసాద్‌బాబు ఉన్నారు.


అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులో వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు

మద్యం, బైక్‌లు స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-రాయదుర్గం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కర్నాటక నుంచి మద్యం అక్రమంగా రాష్ట్రంలోకి రవాణా చేస్తున్న వ్యక్తుల నుంచి మద్యం ప్యాకెట్లు, 4 మోటార్ సైకిళ్ళ స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కంబదూరు మండలంలోని అచ్చంపల్లి వద్ద సోమవారం ఉదయం కంబదూరు ఎస్ఐ పివై.ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో నలు గురు వ్యక్తులు 4 బైక్‌లపై వస్తూ పోలీసులను చూసి ముగ్గురు బైక్‌లను అక్కడే వదిలి పరారయ్యారు. కనగానపల్లి మండలం వేపకుంటకు చెందిన గుజ్జల బ్రహ్మయ్యను అదుపులో తీసుకుని, 1,344 మద్యం ప్యాకెట్లు, 4 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పరారైన ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ నలుగురిపై ఇది వరకే పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదైనట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే శెట్టూరు ఎస్ఐ రాంభూపాల్ ఆధ్వర్యంలో పోలీసులు సరిహద్దు చెక్‌పోస్ట్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ మార్గంలో రాయదుర్గం పట్టణంలోని కోతిగుట్టకు చెందిన ముత్తరాశి అనిల్ కర్నాటక నుంచి 180 మద్యం టెట్రా ప్యాకెట్లు తీసుకొస్తుండగా బైక్, మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేశారు. పోలీసు సిబ్బంది, ఎస్ఐల కృషిని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు. డీఎస్పీ మాట్లాడుతూ సరిహద్దులో అన్ని వైపుల నుంచి మద్యం, నగదు అక్రమ రవాణాను అరికట్టాలని ఆదేశించారు.


స్వాధీనం చేసుకున్న కర్నాటక మద్యం, నిందితుడితో పోలీసులు

వైసిపితోనే అన్ని వర్గాల అభివృద్ధి

బిసి కులాల కార్పొరేషన్ల కోఆర్డినేటర్ ప్రవీణ్

ప్రజాశక్తి-సోమందేపల్లి

రాష్ట్రంలో వైసిపితోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని బిసి కులాల కార్పొరేషన్ల కోఆర్డినేటర్ (సలహాదారు) పులివెందల ప్రవీణ్ పేర్కొన్నారు. పెనుకొండ మండలంలోని మరువపల్లి, కొండపల్లి గ్రామాల్లో పెనుకొండ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రవీణ్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ పొగాకు రామచంద్ర పాల్గొన్నారు. అనంతరం వారు ఎన్నికల ప్రచార వ్యూహంపై చర్చించారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహప్ప, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఫక్రుద్దీన్, వాల్మీకి నటేష్ పాల్గొన్నారు.

2న పింఛనుదారుల ఖాతాల్లో నగదు జమ

రాయదుర్గం : రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మే నెలకు సంబంధించిన పింఛన్ మొత్తాన్ని మే 2వ తేదీ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 6,813 మంది లబ్ధిదారులు ఉండగా 5,003 మంది బ్యాంకు ఖాతాలకు అనుసంధానం ఉందన్నారు. బ్యాంకు ఖాతాకు అనుసంధానం కాని 1,810 మందికి 3వ తేదీ నుంచి మున్సిపల్ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వచ్చి అందజేస్తారన్నారు. అనారోగ్య కారణాలు ఉన్న వారికి, పూర్తిగా నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటి వద్దనే పింఛను అందజేస్తారన్నారు.

డైట్ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు రూరల్ : డైట్ సెట్-2024 ఎంట్రెన్స్‌కి ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి(డిఇఒ) మీనాక్షి తెలిపారు. ఈ కోర్సు రెండేళ్లు ఉంటుందని, ఆసక్తి కలిగిన అర్హులైన విద్యార్థులు మే 9వ తేదీ లోపు CSE AP GOV.IN సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వాడవాడలా తెలుగుతమ్ముళ్ల ప్రచారం

ప్రజాశక్తి-గోరంట్ల

టిడిపి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం తెలుగుతమ్ముళ్లు సోమవారం వాడవాడలా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ భర్త వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ సోమశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పట్టణంలోని శివాలయం వీధి, చౌడేశ్వరి కాలనీ, రెడ్డి వారి వీధి, మసీద్ సర్కిల్‌లో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రకటించిన సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలను, వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు ఎన్నికల్లో సైకిల్ గుర్తుకే ఓటు వేసి ఎమ్మెల్యేగా సవితమ్మను, ఎంపిగా బికె.పార్థసారథిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వారితో పాటు మరిరెడ్డిపల్లి నరసింహులు, జీనవాండ్లపల్లి నరేంద్ర, వెంకటరాముడు, అశ్వత్థరెడ్డి, సుధాకర్‌రెడ్డి, యువ శేఖర్, గంగాధర్, వేణు, జయరాం, నరేష్ పాల్గొన్నారు.

'కాలవ' సమక్షంలో టిడిపిలో చేరిక

రాయదుర్గం : గుమ్మఘట్ట మండలంలోని ఆర్.కొత్తపల్లి గ్రామానికి చెందిన 40 వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారికి సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు నివాసంలో కావల టిడిపి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి సన్నన్న, నాగరాజు, సంజీవ, శివకుమార్, సత్యనారాయణ, రామచంద్రారెడ్డి, తిప్పారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల విస్తృత ప్రచారం

రొద్దం : పెనుకొండ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్‌కు మద్దతుగా సోమవారం వైసిపి శ్రేణులు మండలంలోని తాడంగిపల్లి, మోపుర్లపల్లి, ఎం.కొత్తపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అలాగే ఈ ఎన్నికల మేనిఫెస్టో గురించి తెలిపారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోమారు జగన్ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా ఉషశ్రీచరణ్‌ను, ఎంపిగా బోయ శాంతమ్మను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో బి.నారాయణరెడ్డి, ఎన్.నారాయణరెడ్డి, శ్రీనివాసులు, ఎంపిటిసి వీరేష్, బూచెర్ల సర్పంచి సోమిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

గోరంట్ల : పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో సోమవారం కట్టా నారాయణ రామచంద్ర ఆధ్వర్యంలో 30 వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారికి పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ టిడిపి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సవితమ్మ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి ఎప్పటికీ అండగా ఉంటామన్నారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా పనిచేయాలని సూచించా రు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, జీనవాండ్లపల్లి నరేంద్ర, సుబ్బారెడ్డి, జయరామ్, మరిరెడ్డిపల్లి నరసింహులు, వెంకటరాముడు, మల్లికార్జున, కిషోర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇస్లామిక్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం

రాయదుర్గం: ముస్లిం విద్యార్థుల కోసం పట్టణంలోని 3 మసీదు ల్లో 35 రోజుల సమ్మర్ క్యాంపును ప్రారం భించారు. మక్తాబ్ ఏ దీనియాత్ రాయదుర్గ్ ఉల్మా ఆధ్వర్యంలో పట్టణంలోని జామి యా చౌక్ మస్జిద్, టిప్పు మస్జిద్, మక్కా మస్జిద్‌లో సోమవారం ప్రారంభించారు. ధార్మిక సమ్మర్ క్యాంపు జూన్ 3వ తేదీ వరకూ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. రోజూ ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఇస్లామిక్ గురించి , 'ధార్మిక విద్య నేర్పించే దుకు ప్రతి ముస్లిం తల్లిదం డ్రులు తమ పిల్లలను సమ్మర్ క్యాంపులో చేర్పించాలని జామియా చౌక్ మసీద్ ఇమామ్ ఎజాజ్ ముస్తఫా, మత పెద్దలు కోరారు.

జోరుగా టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-రొద్దం

పెనుకొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ, హిందూపురం ఎంపి అభ్యర్థి బికె.పార్థసారథికి మద్దతుగా మండలంలో తెలుగుతమ్ముళ్లు బిజెపి, జనసేన పార్టీ శ్రేణులతో కలిసి జోరుగా ప్రచారం నిర్వహించారు. వారు సోమవారం మండలంలోని కలిపి, శేషాపురం, బూదిపల్లి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేసి ఆయా పథకాల గురించి వివరించారు. అలాగే జగన్ ప్రభుత్వ వైఫల్యాలు, అరాచక పాలన గురించి తెలిపారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా సవితమ్మను, ఎంపిగా బికె.పార్థసారథిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. టిడిపి అధికారంలోకి రాగానే రైతులకు పంట పెట్టుబడి కోసం ఏటా రూ. 20 వేలు, వృద్ధులకు రూ. 4వేలు, వికలాంగులకు రూ. 6వేల పింఛను ప్రతి నెలా 1వ తేదీ ఉదయమే అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరహరి, నాయకులు మాధవనాయుడు, చంద్రమౌళి, చిన్నప్పయ్య, రాము, తురకలాపట్నం నాగేంద్ర, కసప్ప, నారానాగేపల్లి, మనోహర్, పెద్దపల్లి రాము, చౌడప్ప, తదితరులు పాల్గొన్నారు.



'మెట్టు'కు మద్దతుగా ఓట్లు అభ్యర్థిస్తున్న భార్య యశోదమ్మ

'మెట్టు'కు మద్దతుగా భార్య ప్రచారం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తరపున ఆయన సతీమణి మెట్టు యశోదమ్మ సోమవారం పట్టణంలోని 1వ ఎన్నికల వార్డులో ప్రచారం నిర్వహించారు. ఆమె ఇంటింటికీ వెళ్లి జగన్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా మెట్టు గోవిందరెడ్డిని, ఎంపిగా శంకర నారాయణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆమె వెంట మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప, కౌన్సిలర్లు నాగవేణి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కందికంట తరపున ప్రచారం చేస్తున్న యశోదమ్మ

కందికంట తరపున సతీమణి ప్రచారం

కదిరి టౌన్ : కదిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌కు మద్దతుగా సోమవారం ఆయన భార్య యశోదమ్మ పట్టణంలోని 34వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె స్థానిక టిడిపి శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు, అరాచక పాలన గురించి ప్రజలకు వివరించారు. పేద ప్రజలపై మోయలేని భారాలు వేసిన జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని కోరారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంటను, ఎంపిగా బికె పార్థసారధిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆమెతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు అండగా జగన్

టిటిడి బోర్డు సభ్యులు అశ్వర్థనాయక్

ప్రజాశక్తి-సోమందేపల్లి

వైసిపి ప్రభుత్వంలో సిఎం జగన్ ఎస్సీ, ఎస్టీలకు ఎళ్లవేళలా అండగా నిలిచారని టిటిడి బోర్డు సభ్యులు అశ్వర్థనాయక్ పేర్కొన్నారు. ఆయన సోమవారం పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని మంగాపురంలో కౌన్సిలర్ భాస్కర్‌నాయక్ నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎన్నడూ టిటిడి బోర్డు సభ్యులుగా గిరిజనులు లేరన్నారు. జగన్ చిత్తశుద్ధితో గిరిజనుడైన తనకు టిటిడి బోర్డులో అవకాశం కల్పించారన్నారు. ఈ పదవికి దేశంలో ఎందరో కోటీశ్వర్లు పోటీ పడినా తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చారన్నారు. నా ఎస్టీ, నా ఎస్సీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ జగన్ అందరి సంక్షేమం కోరుకుంటున్నారన్నారు. ప్రతిపక్షపార్టీలు చెప్పుకోడానికి ఏమీ లేక కూటమిగా ఏర్పడి జగన్‌ను ఎదుర్కోడానికి వస్తున్నారన్నారు. ప్రజలు మరోసారి జగన్నుఉ ముఖ్యమంత్రిని చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఎస్టీ తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఆయనతో పాటు నాయకులు శివశంకరనాయక్, రామచంద్రనాయక్, మురళీమోహన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న టిటిడి బోర్డు సభ్యులు అశ్వర్థనాయక్

రాయదుర్గం 'అసెంబ్లీ' బరిలో 13 మంది

ప్రజాశక్తి-రాయదుర్గం



కాలవ శ్రీనివాసులు (తెలుగుదేశం పార్టీ)
మెట్టు గోవింద రెడ్డి (వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ)
ఎంబి చిన్నప్పయ్య (కాంగ్రెస్ పార్టీ)

నామినేషన్లు ఉపసంహరణ అనంతరం రాయదుర్గం అసెంబ్లీ ఎన్నికల బరిలో 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి ఎస్.కరుణకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 17 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా పరిశీలన అనంతరం ముగ్గురి నామినేషన్లు తిరస్కరించబడగా 14 నామినేషన్లు ఆమోదం పొందాయి. నామినేషన్ల ఉపసంహరణకు సోమవారం నాటితో గడువు ముగియగా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన గౌని ఊహారాణి ఉపసంహరించుకున్నారు. చివరకు 13 మంది ఎన్నికల బరిలో ఉన్నట్లు ఆర్ఒ తెలిపారు. వీరిలో కాంగ్రెస్ పార్టీ తరపున ఎంబి చిన్నప్పయ్య, వైసిపి నుంచి మెట్టు గోవిందరెడ్డి, తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కాలవ శ్రీనివాసులు, బీఎస్పీ తరపున సి.నాగరాజు, బిసివై నుంచి గౌని ప్రతాపరెడ్డి పోటీలో ఉన్నారు. వీరితో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా కావలి శ్రీనివాసులు, ఉండల రామచంద్రారెడ్డి, హరిజన రంగనాథ్, కురుబ శ్రీనివాసులు, పగడాల గోవిందరాజులు, గోవిందు, బళ్లారి గోవింద, కావలి శ్రీనివాసులు పోటీలో ఉన్నారు. బి ఫారం సమర్పించిన రాజకీయ పార్టీల నాయకులకు ఆయా పార్టీల గుర్తులు, స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ ప్రతిపాదించిన గుర్తుల్లో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న గుర్తులు కేటాయిస్తామన్నారు.

పెనుకొండ పోటీలో 9 మంది

స్వతంత్ర అభ్యర్థి ఈ. నరేంద్ర నామినేషన్ ఉపసంహరణ

ప్రజాశక్తి-సోమందేపల్లి



సవితమ్మ (తెలుగుదేశం పార్టీ)
కెవి.ఉషశ్రీచరణ్ (వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ)
బోయ నరసింహప్ప (కాంగ్రెస్ పార్టీ)

సోమవారం నాటితో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. దీంతో పెనుకొండ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో స్వతంత్ర అభ్యర్థి ఈ.నరేంద్ర నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. చివరకు శాసనసభ ఎన్నికల బరిలో 9 మంది అభ్యర్థులు నిలిచారు. టిడిపి తరపున సవితమ్మ, వైసిపి నుంచి కెవి.ఉషశ్రీచరణ్, కాంగ్రెస్ అభ్యర్థిగా బోయనరసింహప్ప, బిఎస్పీ, జై బీమ్ పార్టీల అభ్యర్థులతో పాటు నలుగురు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో నిలిచారు. పోటీలో నిలిచిన అభ్యర్థులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అపూర్వ భరత్ గుర్తులు కేటాయించారు. రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు.

టిడిపి రెబల్ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి అసెంబ్లీ స్థానానికి టిడిపి రెబల్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన వడ్డే పోలన్న తన నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకున్నారు. పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం ఉదయం వడ్డే పోలన్న వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు జెరిపిటి కృష్ణమూర్తితో కలిసి వెళ్లి నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి భాగ్యరేఖ నుంచి వెనక్కి తీసుకున్నారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరరెడ్డికి తమ పూర్తి మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గానికి టికెట్ ఆశించి భంగపడ్డ పోలన్న స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన విషయం తెలిసిందే. అతడితో ఆదివారం జిల్లా పరిశీలకుడు రవీంద్ర, పార్టీ పెద్దలు చర్చించడంతో ఎట్టకేలకు నామినేషన్ ఉపసంహరించుకున్నారు. వడ్డెర కులస్తులకు నామినేటెడ్ పదవులు కానీ ఎమ్మెల్సీ కానీ కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. తాను డబ్బులకు అమ్ముడు పోలేదని, మా సామాజిక వర్గానికి సముచిన స్థానం కల్పిస్తానన్న అధిష్టానం హామీపై పోటీ నుంచి విరమించుకున్నట్లు వడ్డే పోలన్న తెలిపారు. అలాగే వడ్డెర్ల సంఘం తరపున తనను క్షమించాలని కోరారు. ఇక నుంచి పుట్టపర్తి నియోజకవర్గ అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



నామినేషన్‌ను ఉపసంహరించుకుంటున్న వడ్డే పోలన్న

రఘువీరా మాయమాటలు నమ్మొద్దు

వైసిపి రాష్ట్ర పరిశీలకులు అశోక్‌కుమార్

ప్రజాశక్తి-మడకశిర

సిడబ్ల్యుసి మెంబర్ ఎన్.రఘువీరారెడ్డి చెప్పే కల్లి బుల్లి మాటలు నమ్మవద్దని వైసిపి రాష్ట్ర పరిశీలకులు పోకుల అశోక్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలను మభ్య పెట్టడానికి రఘువీరా అమలు కాని హామీలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేసిన రఘువీరా ఆ సమయములో ఎందుకు హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేయలేదని, చెరువులకు నీళ్లు నింపలేదని ప్రశ్నించారు. ఆర్.అనంతపురం సమీపంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో జగన్ పాలనలో రైతులందరికీ నిధులు మంజూరు చేసి పంపిణీ చేశారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను విస్మరించిన రఘువీరా ఇప్పుడు అబద్ధాలు చెబితే ప్రజలు నమ్మరని తెలిపారు. ఆయనతో పాటు మాజీ మంత్రి హెచ్.నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్‌రెడ్డి, అనంతరాజు, జిబి శివకుమార్, వైసి.గోవర్ధన్ రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, కాంతరాజు, హనుమంతరాయప్ప, బిటి పల్లి దేవరాజ్, రొళ్ల కన్వీనర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్



వానవోలులో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరసింహులు

వానవోలులో కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం

గోరంట్ల : పెనుకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరసింహులు సోమవారం మండలంలోని వానవోలు గ్రామం లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయన స్థానిక పార్టీ నాయకు లతో కలిసి ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని నరసింహులు ఓటర్లను అభ్యర్థించారు. ఆయన వెంట సోమందేపల్లి మండల కన్వీనర్ గంగాధర్, పరిగి మండల కన్వీనర్ ఈశ్వరప్ప, ట్రేడ్ యూనియన్ లీడర్ బాబు, నాయకులు దస్తగిరి, నరసింహులు ఉన్నారు.



ఉషశ్రీచరణ్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న జ్యోతి

ఉషశ్రీచరణ్‌కు మద్దతుగా సోదరి ప్రచారం

ప్రజాశక్తి- సోమందేపల్లి


పెనుకొండ నగర పంచాయతీలోని 17వ వార్డులో సోమవారం పెనుకొండ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ తరపున ఆమె సోదరి జ్యోతి, నగర పంచాయతీ ఛైర్మన్ ఫరూక్, వైస్ ఛైర్మన్లు సునీల్, జయశంకర్‌రెడ్డి, కౌన్సిలర్ రామాంజి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు వార్డులో ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వేయించి ఎమ్మెల్యేగా ఉషశ్రీచరణ్, హిందూపురం ఎంపిగా బోయ శాంతమ్మను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోమారు జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందామని తెలిపారు. వారి వెంట టౌన్ కన్వీనర్ నరసింహ, కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, బోయ బాబు, తయూబ్, శేషాద్రి, నాయకులు కొండలరాయుడు, వెంకటేష్, శంకర్‌రెడ్డి, నిషార్, సిగ్బతుల్లా, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

పెనుకొండ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి- సోమందేపల్లి

వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పెనుకొండ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెవి.ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. ఆమె సోమవారం పెనుకొండ మండలం రాంపురం పంచాయతీలోని గ్రామాల్లో ఎమ్మెల్సీ మంగమ్మ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ పొగాకు రామచంద్ర, హిందూపురం ఎంపి అభ్యర్థి బోయ శాంతమ్మతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా వారికి నాయకులు గోపాల్‌రెడ్డి, నారాయణ, అంజినాయక్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అలాగే నూతన మేనిఫెస్టోలోని పథకాలను తెలిపి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా ఉషశ్రీచరణ్‌ను, ఎంపిగా బోయ శాంతమ్మను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నాగలూరు బాబు, ఎంపిపిలు గీతారామ్మోహన్‌రెడ్డి, గంగమ్మవెంకటరత్నం, నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచులు నాగమూర్తి, నాగరాజు, నాయకులు సంజీవరెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, చెన్నకేశవ, కోడిపల్లి గోవర్ధన్‌రెడ్డి, సుధామ, రాజశేఖర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల మేనిఫెస్టో పోస్టర్‌ను అందజేస్తున్న ఉషశ్రీచరణ్

'అనంత' బరిలో 15 మంది అభ్యర్థులు



అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం అర్బన్ శాసనసభ నియోజకవర్గం స్థానికి ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులు నిలిచారు. ఈమేరకు రిటర్నింగ్ అధికారి గ్రంధి వెంకటేష్ పోటీలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేశారు. 28 మంది అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేయగా పరిశీలనలో 21 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసహరించుకున్నట్లు తెలిపారు. ఏడుగురి నామినేషన్లను తిరస్కరించారు. దీంతో 15 మంది పోటీలో నిలిచారు. ఆయా అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ కేటాయించిన గుర్తులను ప్రకటించారు. వైసిపి నుంచి అనంత వెంకటరామిరెడ్డి, టిడిపి నుంచి దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, బీఎస్పీ నుంచి కె.నాగరాజు, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి ఆకుల రాఘవేంద్ర, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి కుమ్మెత సూర్యశేఖర్‌రెడ్డి, సిపిఐ నుంచి సి.జాఫర్, ఆల్ ఇండియా కిసాన్ జనతా పార్టీ నుంచి భాస్కర్ తలారి, ఎస్‌యుసిఐ నుంచి డి.రాఘవేంద్ర, స్వతంత్ర అభ్యర్థులుగా గడియారం మల్లికార్జున, జయలక్ష్మి, శ్రీ రంగరాజుల గోపీనాథ్ రాయల్, వి.సాయిప్రసాద్, వి.సాయి ప్రసాద్, వి.సురేంద్ర రావు, వి.హరికుమార్ ఎన్నికల బరిలో నిలిచారు.

గుంతకల్లు ఎన్నికల బరిలో 14 మంది



గుంతకల్లు : నామినేషన్ల ఉపసంహరణ అనంతరం గుంతకల్లు అసెంబ్లీ బరిలో 14 మంది అభ్యర్థులు నిలచినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నామినేషన్ల ముగింపు రోజుకు 20 నామినేషన్లు దాఖలు అయ్యాయన్నారు. సోమవారం నిర్వహించిన పరిశీలనలో పి.రామాంజినేయులు, తోక భారతి, బి.జయరామ్ తమ నామినేషన్లను ఉపసంహరణ చేసుకోగా 14మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారని వివరించారు. టిడిపి అభ్యర్థి గుమ్మనూరు జయరామ్, వైసిపి వై.వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ నుంచి ప్రభాకర్, బీఎస్పీ నుంచి షేక్ అబ్దుల్ మాలిక్, సమాజ్ వాది పార్టీ నుంచి జంగం కృష్ణ, జై భీమ్‌రావ్ భారత్ పార్టీ నుంచి ఎం.శివభూషణ్‌రెడ్డి, భారత చైతన్య యువజన పార్టీ నుంచి రహిమాపితోపాటు స్వతంత్ర అభ్యర్థులుగా జి.ఎం.అరుణ్‌కుమార్, సి.ఆదినారాయణ చౌదరి, ఈడిగ పెద్ద ఆంజనేయులు, ఎం.ఖమర్ బేగం, బోయగడ్డ అరుణ, ఆర్.విక్టర్,షేక్ మహబూబ్‌బాషా ఎన్నికల బరిలో నిలిచారని తెలిపారు.

శింగనమల బరిలో 14 మంది



శింగనమల : నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం ముగియడంతో శింగనమల నియోజకవర్గంలో 14 మంది ఎన్నికల బరిలో నిలిచినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నెల శ్రీను తెలిపారు. సోమవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొత్తం 16 మంది నామినేషన్లు దాఖలు చేయగా ఇద్దరు ఉపసంహరించుకోగా 14మంది అభ్యర్థులు బరిలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో శింగనమల తహాశీల్దార్ శోభన్‌బాబు, ఎన్నికల డిప్యూటీ తహాశీల్దార్ రామకృష్ణ, యల్లనూరు, పుట్లూరు, నార్పల, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె మండలాల తహాశీల్దార్లు, ఎన్నికల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి..అభివృద్ధి చేస్తా..

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

'నాకు డబ్బు మీద ఆశ లేదు.. నేను మండలాధ్యక్షుడిగా ఉన్నప్పుడు రాప్తాడు మండలంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో కృషి చేశా.. ప్రజలు ఒక్క సారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే అనంతపురం నగరాన్ని అభివృద్ధి చేసి తానేంటో నిరూపించుకుంటా..' అంటూ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. సోమవారం తపోవనంలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి డిష్.నాగరాజు ఆధ్వర్యంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులతో కలిసి ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ తన గ్రామం నగరానికి కూత వేటు దూరంలోనే ఉందన్నారు. తన చిన్నతనం అంతా నగరంలోనే సాగిందన్నారు. తన మిత్రులు, గురువులు, శ్రేయోభిలాషులు అందరూ అనంతపురంలోనే ఉన్నారన్నారు. ఎప్పటి నుంచో రాజకీయాల్లో రాణించాలని ఒక చిన్న ఆశ ఉందన్నారు. ఇందుకు చంద్రబాబు నాయుడు అవకాశం కల్పించారన్నారు. ప్రజలు నమ్మి తనకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్



ముస్లిం నాయకులతో దగ్గుపాటి ప్రసాద్

'అనంత' అవినీతి లెక్కలు తేలుస్తాం..

రెండు నెలల్లో టిడిపి ప్రభుత్వం ఏర్పాటు కాబోతోంది. ప్రజల ఆశీర్వాందంతో తాను ఎమ్మెల్యేగా గెలిచి తీరుతా. అప్పుడు అనంతపురం వైఎస్ఆర్‌సిపి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఐదేళ్ల పాలనలో కొనసాగించిన అవినీతి లెక్కలన్ని తేలుస్తామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ హెచ్చరించారు. ఇంటింటికి వెళ్తూ బాబు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూప, మాజీ కార్పొరేటర్ నటేష్ చౌదరి, టిడిపి నాయకుడు నెట్టెం బాలకష్ణ, టిఎన్‌టియుసి నగర అధ్యక్షుడు పూల బాషా, నారాయణపురం పంచాయతీ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. పలువురు వైసిపి నేతలు టిడిపిలో చేరారు. దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో వందల మంది అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. 26వ డివిజన్ వైసీపీ ఇన్‌ఛార్జి వెంకటేశ్వరరెడ్డి 100 కుటుంబాలతో కలిసి టీడీపీలో చేరారు. అలాగే మాజీ కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ కూడా వైసీపీని వీడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్ మొయిద్దీన్ కూడా పాల్గొన్నారు. రుద్రం పేటలోని చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన 25 కుటుంబాల వారు తలారి పోతులయ్య, చరణ్ రాజ్, నాగభూషణం ఆధ్వర్యంలో దగ్గుపాటి సమక్షంలో పార్టీలో చేరారు. వీరందరికీ దగ్గుపాటి టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసిపి పాలనలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-వజ్రకరూరు

వైసిపి పాలనలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ విమర్శించారు. సోమవారం విడపనకల్లు మండల పరిధిలోని పోలికి, వేల్పుమడుగు, జనార్ధన పల్లి, తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలిస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లకాలంలో వైసిపి ప్రభుత్వం రైతులు, ఉద్యోగ, నిరుద్యోగుల జీవితాలతో వైసిపి ప్రభుత్వం చెలగాటం ఆడిందన్నారు. ముఖ్యంగా ఎస్సీలకు సంబంధించి 27 పథకాలను రద్దు చేసి వారి అభివృద్ధిని అడ్డుకుందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని, మరోసారి అవకాశం కల్పిస్తే ప్రజలందరికీ అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.



కేశవ్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న శ్రేణులు

కాంగ్రెస్ అభ్యర్థి శంకర్ ముమ్మర ప్రచారం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాప్తాడు అసెంబ్లీ నియోజవర్గ ఇండియా వేదిక కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సాకే శంకర్ ఎన్నికల ప్రచారాన్ని వేగవంతం చేశారు. నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలను కలుపుకుని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి, చిన్న కుంట, మన్నీల, మైనార్టీ కాలనీలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రచార కరపత్రాలను అందజేసి ఓట్లు అభ్యర్థించారు. గ్రామ పెద్దలు, వృద్ధులకు పాదాలు మొక్కి ఆశీర్వాదాలు తీసుకుంటూ ఓట్లు వేసి గెలిపించాలంటూ విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాల ప్రజలు స్వాగతం పలికి మద్దతు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని, పేదలు బాగుపడాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.



ఓటరును అభ్యర్థిస్తున్న సాకే శంకర్

నేడు బండారు శ్రావణిశ్రీ ప్రచారం

పుట్లూరు : టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ మంగళవారం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఆమెతోపాటు ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, జేసీ పవన్‌కుమార్‌రెడ్డి ప్రచారంలో పాల్గొననున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. కావున మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని నాయకులు కోరారు.

మీ ఆడబిడ్డగా వచ్చా.. ఆదరించండి..: శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

'మీ ఆడబిడ్డగా మీ ముందుకు వచ్చా.. మీలో ఒక్కరిగా ఉంటా.. వచ్చే ఎన్నికల్లో ఆదరించండి..' అంటూ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'మీ ఇంటి ఆడబిడ్డగా మీ ముందుకొచ్చా.. మన పిల్లలు భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి... పిల్లల భవిష్యత్తు, ఉద్యోగాలు గురించి ఆలోచించి వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేయాలి' అంటూ పిలుపునిచ్చారు. తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవకురాలిగా పని చేస్తానన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా.. పిల్లల భవిష్యత్తు బాగుండాలన్న.. ముఖ్యమంత్రిగా చంద్రబాబు కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మరోసారి వైసిపి వస్తే ప్రజలకు కష్టాలు తప్పవన్నారు. ఇసుక మాఫియాలు ఉద్భవించడంతోపాటు నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎంపీగా అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేగా తననూ ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, మాజీ ఎంపిపి ఆకుల అరుణ, సీనియర్ నాయకులు ఆకుల ఆంజనేయులు, ఆలం నాగార్జున, ఆకుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టిడిపి నాయకులు

తరిమెలలో 'దండు' ప్రచారం

శింగనమల : ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణకు మద్దతుగా తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు సోమవారం మండల పరిధిలోని తరిమెలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు.

జగన్‌పై చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు

అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

విశ్వసనీయతకు మారుపేరైన సిఎం జగన్‌ను ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేని టిడిపి అధినేత చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని 2వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో ఐదేళ్లుగా జరిగిన అభివృద్ధిని వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌ను చంపితే ఏమవుతుందంటూ నెల్లూరు జిల్లాలో చంద్రబాబు చెప్పడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా మరోసారి జగన్ సిఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఐదేళ్లలో 99 శాతం హామీలన్నింటినీ అమలు చేశామన్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ఏకంగా మేనిఫెస్టోను మాయం చేసే చరిత్ర చంద్రబాబుది అని ఎద్దేవా చేశారు. కాగా అనంతపురం నియోజకవర్గంలో 27 వేల మందికి పట్టాలు ఇచ్చామన్నారు. రానున్న రోజుల్లో ఇళ్ల లేని అందరికీ పట్టాలు ఇచ్చి ఇంటి నిర్మాణం చేపడతామన్నారు. మరోసారి వైసీపీ అధికారంలోకి రాగానే అనంతపురంలో క్యాన్సర్ కేర్ సెంటర్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు.



ఓటరును అభ్యర్థిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

వైసిపి గూటికి టిడిపి మైనార్టీ నే అజీజ్

టిడిపి మైనార్టీ విభాగం అనంతపురం నగర అధ్యక్షులు అజీజ్ టిడిపికి గుడ్‌బై చెప్పారు. ఈమేరకు సోమవారం నగరంలోని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి స్వగృహంలో అజీజ్‌తోపాటు ముస్లిములు అన్సర్, అహ్మద్, ముస్తఫా, మున్నీ, ముంతాజ్, ఇరజిన బి, షంషాద్, ఆయిషా, హసీనా, బాను, మాలిన్ తదితరులు వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.